బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

శంషాబాద్: శంషాబాద్ పట్టణం సాతంరాయిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విరూపాక్ష తెలిపారు. బీఎస్సీ (ఎంఎస్ఏఐ, ఎంఎల్), బీఎస్సీ (బీజెడ్సీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీబీఏ, బీఏతో పాటు బీబీఏ, ఎల్ఎల్బీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. సంబంధిత కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా హాజరై ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఉచిత వసతి, భోజనం, నాణ్యమైన విద్యాబోధన, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. వివరాలకు ఫోన్: 70759 33281లో సంప్రదించాలన్నారు

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని మాతా పోచమ్మ ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా ప్రసాద వితరణ.. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఎం.రాంబాబు, డీ.యాదగిరి, జీ.బాబురావు, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, ఉమ్మారెడ్డి, నవీన్, రఘు, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా నాగులమ్మ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

మణికొండ: మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న నాగులమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చన, హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డిలతో పాటు నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వామి వార్లకు వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 6కు మంగళ వాయిద్యం, 7కు స్వామివార్లకు పంచామృతాభిషేకం, 9కి స్వామి వార్లకు మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, 10.45 గంటలకు స్వామి వార్లకు పుష్పార్చన, మధ్యాహ్నం 12 గంటలకు నివేదన, హారతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యుడు సామ ఇంద్రపాల్‌రెడ్డి తెలిపారు.

క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య


చంద్రశేఖర్ (ఫైల్)

రాజేంద్రనగర్: ఉరి వేసుకొని ఓ క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భానుమతి సమాచారం మేరకు... హైదర్‌గూడ కేశవగిరినగర్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్(25) తన మేనమామ నివాసంలో ఉంటున్నాడు. చిన్ననాటి నుంచే మేనమామ వద్ద చంద్రశేఖర్ ఉంటున్నాడు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం తన రూమ్‌లో నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం ఉదయం గది నుంచి బయటికి రాకపోవడంతో పరిశీలించగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగుచూసింది దీంతో కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కార్మికులు

మణికొండ: ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారు వారి ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని మణికొండ మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మణికొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుమ్ము, ధూళి, మురుగులో పనిచేసే కార్మికులకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సూచనలు, సలహాలను పాటించి ఆరోగ్యంన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, భారత్ వికాస్ పరిషత్ ప్రాంత సంపర్క్ ఉపాధ్యక్షుడు రఘు సతీష్‌కుమార్, మణికొండ బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి, కార్యదర్శి బాల భారతి, కోశాధికారి అజయ్‌కుమార్, శానిటేషన్ ఇంచార్జి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు విద్యార్థుల తాకిడి!


టెన్త్ విద్యార్థులకు ఫిజిక్స్ ప్రాక్టికల్స్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు


శిథిలావస్థకు చేరిన అత్తాపూర్ పాఠశాల భవనం


పెచ్చులూడిన భవనంలో విద్యార్థులు

- పాఠశాలల్లో కొరవడిన మౌలిక వసతులు
- అరకొరగానే బోధన, బోధనేతర సిబ్బంది
- నియామకాల్లో జాప్యంపై నిరసన వెల్లువ


నూతన భవనంలోని తరగతి గదిలో విద్యార్థులు


దాతలు నిర్మించిన అదనపు తరగతి గదులు

అత్తాపూర్: నాణ్యమైన విద్య.. అర్హులైన ఉపాధ్యాయులు, సరిపడా క్రీడా మైదానాలు, ఫీజులు.. ఆర్థిక వేధింపులు లేని వాతావరణం.. ఉచిత విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇలా ఎన్నో వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల తాకిడి క్రమంగా పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని భరించలేని పేద, మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేందుకే ఆసక్తి చూపుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు సరిపడా వసతులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో లేకపోవడం ఒకింత నిరుత్సాహానికి గురిచేస్తోంది.

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య లభిస్తుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నామని అందుకు సరిపడా వసతులు కల్పించాలని కోరుతున్నారు.
- అత్తాపూర్, శివరాంపల్లి, గణేష్‌నగర్, బుద్వేల్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, గగన్‌పహాడ్, ప్రేమావతీపేట్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాల హై స్కూల్లో ఈ విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతిలో 511 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్ తీసుకున్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తోంది. భాషా పండితులు గణిత శాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రాలతో పాటు సాంఘిక శాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత ఉంది.
- రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో ఉన్న ప్రతి పాఠశాలలో వలస కార్మికుల పిల్లలు ఎక్కువగా చదువుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు స్థానికుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి..

అధ్వాన స్థితికి చేరిన అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కార్పొరేట్ సంస్థలు, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో రూ. 30 లక్షల వ్యయంతో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టారు. మౌలిక వసతుల్లో భాగంగా నూతనంగా టాయిలెట్స్‌ను నిర్మించడంతో పాటు తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా బోరుబావి ఏర్పాటు చేశారు. ప్యూరిఫయర్ వాటర్ కోసం అత్తాపూర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహకారంతో ఏర్పాటు చేసుకున్నారు. విద్యార్థుల అవసరాల కోసం సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ల పర్యవేక్షణతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుతో పాటు క్రీడలు వైపూ మొగ్గు చూపుతున్నారు. ఆ దిశగా ప్రతిభ కనబరుస్తున్నారు. వివిధ క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తాచాటుతూ పాఠశాలకు మంచిపేరు తీసుకొస్తున్నారు.

శివారు మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

శంషాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై సమీక్షించిన సీఎస్, కలెక్టర్


శంషాబాద్ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు


ఎకో పార్కును పరిశీలిస్తున్న సీఎస్, కలెక్టర్ తదితరులు

శంషాబాద్: అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర శివారులోని మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అందుకు అవసరమైనర నిధులు సమకూరుస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన సంబంధిత శాఖల అధికారులతో కలిసి శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి నిధుల సమీకరణతో పాటు ఉద్యోగులు, సిబ్బంది కొరత సంబంధిత అంశాలను డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం అతి తక్కువగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆస్తి పన్ను వసూళ్లను పెంచడంతో పాటు కొత్త ఇళ్లకు ఆస్తిపన్ను ముదింపు ప్రక్రియను చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. తాగునీటి సరఫరా కోసం సంబంధిత మున్సిపాలిటీలకు, పంచాయతీలకు నిధులు అందజేస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు ఉన్నాయని ఆరాతీశారు. నాలాల పరిశుభ్రత ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా ప్రాధాన్యతక్రమంలో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మున్సిపాలిటీలు పూర్తి స్థాయిలో సమీక్షలు నిర్వహించుని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వస్తే తగిన నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు.

ఎకో పార్కు సందర్శన...

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్వాల్‌గూడలో నిర్మాణంలో ఉన్న ఎకో పార్కును సీఎస్ సందర్శించారు. పార్కులో ఉన్న పక్షులను పరిశీలించి అందులోని కొన్ని రకాల చిలుకలను ధాన్యాలను తినిపించి బాగుందని ప్రశంసించారు. వంతెనపై నుంచి పార్కు మొత్తం కలియదిరిగారు. అనంతరం అక్కడి నుంచి పక్కనే ఉన్న బుద్వేల్ ప్రభుత్వ భూములను పరిశీలించారు. సమావేశంలో పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కార్యదర్శి సర్ఫరాజ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకటర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు గుణపాఠం తథ్యం



మాట్లాడుతున్న వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ వస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురుమ ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన కొనసాగించే అవగాహన లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలి వీస్తున్నదని రాను న్న ఎన్నికల్లో ఆ పార్టీ ప్రజల ఆగ్రహానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, రాఘవేందర్‌యాదవ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, రాజేష్‌యాదవ్, ఎడ్లకాడి సూర్యం, భూదేవి, అరుణరెడ్డి, మైసిరెడ్డి, భగవాన్‌దాస్, భాస్కర్, చిరంజీవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పుప్పాలగూడ మాజీ సర్పంచ్ అరెస్టు

- రూ. 2.2 కోట్ల నిధుల దుర్వినియోగం
- రూ. 23.68 లక్షలు తిరిగి చెల్లింపు
- లోకాయుక్త ఆదేశంతో డీఎల్‌పీఓ ఫిర్యాదు
- రిమాండ్‌కు తరలించిన నార్సింగి పోలీసులు


సునీతరాజ్‌కుమార్

మణికొండ: ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రజా ధనాన్ని సంరక్షించాల్సింది పోయి దుర్వినియోగం చేసిన సర్పంచ్‌పై చర్యలకు లోకాయుక్త ఆదేశించింది. ఏకంగా రూ. 2,02,30,885లు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు రావటంతో అప్పట్లో కొందరు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విచారణ క్రమంలోనే ప్రభుత్వానికి రూ. 23,68,618లు తిరిగి చెల్లించారు. అయినా ప్రజాసేవకులుగా ఉంటూ నమ్మకద్రోహం, మోసానికి పాల్పడినట్టు లోకాయుక్త కోర్టు తేల్చి చర్యలకు ఆదేశించింది. దాంతో రాజేంద్రనగర్ డివిజన్ పంచాయతీ అధికారి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సెక్షన్ 409, 420ల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు. నార్సింగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామపంచాయతీకి 2014 నుంచి 2019 సంవత్సరం వరకు సర్పంచ్‌గా గ్రామానికి చెందిన మహేశ్వరం సునీత రాజ్‌కుమార్ పనిచేశారు. ఆమెపై పదవిలో ఉండగానే ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలు రావటంతో ఆమె వ్యతిరేకులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. 2019 సంవత్సరంలోనే తన పదవీకాలం పూర్తి కాకముందే సస్పెన్షన్‌కు గురి కావటంతో మూడు నెలల కాలం ఉప సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి కొనసాగిన విచారణలో ట్రిబ్యునల్ ఉత్తర్వులు, విచారణ నివేదికలు, చలాన్లు, బాధితురాలి లిఖిత పత్రాలు వంటి పలు ఆధారాలు లభించాయి. దాంతో లోకాయుక్త ఆమెకు వ్యతిరేకంగా ఇటీవల తీర్పు చెప్పింది. దాంతో రాజేంద్రనగర్ డీఎల్‌పీఓ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి శుక్రవారం 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇదే కేసులో మరికొందరి పాత్రలపై విచారణ కొనసాగిస్తున్నామని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త సర్వీసుల విడుదల, ఫీడర్‌ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ మణికంఠ తెలిపారు. మార్కెట్ యార్డ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వివేకానంద ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, కోకాపేట సబ్‌స్టేషన్, బాబుఖాన్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అక్షయ పాత్ర ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, కోకాపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ మణికంఠ తెలిపారు. ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ ఉస్మాన్‌సాగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అలిజాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మిలట్రీ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. సీబీఐటీ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు, గండిపేట ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు తెలిపారు. గోల్డ్ డ్రాప్, పద్మశాలీపురం, ఆర్ఈసీ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీటా దెల్, దివ్యశక్తి, పద్మశాలీపురం, ఆప్కో కాలనీ, మధుబన్‌కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ, ఆరాంఘర్, పరివార్ , తమిళనాడు హోటల్, పిలోనీ రబ్బర్ సంస్థ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మెట్రో మాల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు గగన్‌పహాడ్ గ్రామం, మెట్రో మాల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు వారి వివరించారు.

హౌసింగ్ బోర్డు ప్లాట్లపై అనాసక్తి!

- వేలం పాటలో కొనుగోలు చేయని వైనం
- గజం ధర రూ. 45 వేలు ఉండటమే కారణం
- ఇది ఓపెన్ మార్కెట్ ధరకన్నా అధికం అంటున్న స్థానికులు
- 15 ప్లాట్లకు గాను చివరగా ఒకటి విక్రయం


స్థలం పత్రాలను అందజేస్తున్న హౌసింగ్ బోర్డు అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు గృహకల్ప ఆధ్వర్యంలో ఓపెన్ ప్లాట్స్‌కు వేలం పాట నిర్వహించారు. ఎస్టేట్ ఆఫీసర్ విమల, ఈఈ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ కాలనీలో సుమారు 3790 గజాలలో 15 ఓపెన్ ప్లాట్లుగా ఏర్పాటు చేసి రూ. 45 వేలతో పాట నిర్వహించారు. ఆసక్తి గల వారు ఉదయం 11 గంటల లోపు రూ. 5 లక్షల డీడీ కట్టి వేలం పాటలో పాల్గొనాల్సి ఉండగా ఆ సమయానికి అక్కడికి ఎవరూ రాలేరు. ఇద్దరు మాత్రమే డీడీ కట్టి పాటలో ఉన్నారు. వేలం పాటలో పాల్గొనాలంటే ముగ్గురు కావాలి. చివరగా ఒక్క ప్లాట్‌కు మాత్రం వేలం పాట జరిగింది. స్థానికులు ఒగం ప్రవీణ రూ. 46500కు పాట పాడి సొంతం చేసుకున్నారు. ఓపెన్ మార్కెట్ రేటు రూ. 40 వేలున్నా హౌసింగ్ బోర్డు వేలంలో రూ. 45 వేల ప్రకారం నిర్ధారించినందునే కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్లపై గుంతలు.. తప్పని ఇబ్బందులు

- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- గుంతల్లో పడి గాయపడుతున్న పాదచారులు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం నిల్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం


గుంతలు పడిన హైదర్‌గూడ రోడ్డు


ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోల్

అత్తాపూర్: గుంతలు పడిన రోడ్లు.. నాణ్యత లేని డ్రైనేజీల నిర్మాణాలు, పై కప్పులు లేని డ్రైనేజీల మ్యాన్‌హోళ్ల కారణంగా ప్రజలు ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలబారినా పడుతున్నారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ ఓల్డ్ విలేజ్ కుమ్మరి బస్తీ, హైదర్‌గూడ, జనప్రియ యూటోపియ, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయి. మ్యాన్‌హోల్స్ విషయంలో కానీ రోడ్డు నిర్మాణ పనుల విషయంలో కానీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోళ్ల పనులు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మూడు నెలలు కూడా కాలేదు తిరిగి ఇప్పుడే పనులు చేయలేమంటూ అధికారులు చెబుతున్నారు. మంచినీటి పైపులైన్ లీకేజీలకు ఎలాంటి మరమ్మతులు చేయకుండానే నాణ్యతలేని కంకర ఇసుకతో మమ అనిపిస్తూ చేతులు దులుపుకొటున్నారు. అవికాస్తా మూడు రోజులకే తిరిగి లీకవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గుండా రాకపోకలు సాగించే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాణ్యత లేని పనులు అంగీకరించే ప్రసక్తే లేదని అలాంటి పనులు చేసినా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నామని హెచ్చరికలు జారీ చేసిన ప్రయోజనం లేకుండా పోతుందని అధికారులు చెబుతున్నారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని కూడా వారు పేర్కొంటున్నారు. నిర్మాణ సమయంలో బాధ్యతకల్గిన ప్రజలుగా నాణ్యత, ప్రమాణాలపై సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీయాలని కూడా చెబుతున్నారు. అలా చైతన్యవంతులుగా ప్రజలు మారితేనే అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉంటుందనడం నిర్వివాదాంశం.